# యువతకు ఉపాధి కల్పిస్తాం



జనగామ మండలం పెంబర్తిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బొట్టు పెడుతున్న మహిళలు

- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తాం
- అభివృద్ధి జరగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఊరూరా ఘనస్వాగతం పలికిన ప్రజలు

జనగామ రూరల్, నవంబర్ 2 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతోపాటు జనగామలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి పెంబర్తిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, ఓబుల్ కేశ్వాపూర్, పసరమడ్ల, శామీర్‌పేట గ్రామాల్లో రైతుబంధు సమితి చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, జనగామ ఎన్నికల ఇన్‌చార్జి తాటికొండ రాజయ్యతో కలిసి పల్లా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ, కోలాటం ఆటలు, ఒగ్గుడోలు, కనకడప్పుల మోతలు, బోనాల ఆటలు, మంగళహారతులతో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎక్కడ చూసినా మహిళలు ముందుండి పల్లాను అక్కున చేర్చుకున్నారు. ప్రతి గడపకు తిరుగుతూ ప్రతిఒక్కరినీ పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని పల్లా కోరారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని పల్లెలో హను మంతుడి గుడిలేని గ్రామం లేదు, బీఆర్‌ఎస్ సంక్షేమ పథకం అందుకోని ఇల్లు లేదన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఇక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. దీంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, పామ్‌ఆయిల్ ఇండస్ట్రీ, నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలలను నిర్మించుకుందామన్నారు. ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు పాటుపడుతానన్నారు. ప్రతి గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చెబుతున్నా మాటలు నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాలు మంజూరు చేస్తామని తెలిపారు. ముస్లింలకు ఖబ్రస్తాన్ నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తానన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేసి వాటిని పూర్తి చేస్తానన్నారు. నిధులు లేకుంటే తనసొంత డబ్బులతో గ్రామాలను అభివృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటుకు తనవంతు సహకారం అందజేస్తానని తెలిపారు.

**జనగామ రామబాణం పల్లా : ఎమ్మెల్యే రాజయ్య**

పల్లెల అభివృద్ధికి మారుపేరైన పల్లాను సీఎం కేసీఆర్ స్వయంగా జనగామకు పంపించారని, పల్లాను గెలిపిస్తే రామబాణం మాదిరిగా అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. జనగామ రూపురేఖలు మార్చడానికి పల్లాను ఇక్కడికి సీఎం కేసీఆర్ పంపించారని తెలిపారు. పల్లా గెలుపు.. జనగామ అభివృద్ధికి మలుపు అయితదన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పల్లా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, ఎంపీపీ మేకల కలింగరాజు, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖ, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, సర్పంచుల, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాళ్లు బొల్లం శారద, బండ లక్ష్మి, సర్పంచులు అంబాల ఆంజనేయులుగౌడ్, ఎర్ర సుజాత, ఏళ్ల సుజాత, కొమ్ము సుజాతాజగదీశ్, శివరాత్రి స్వప్నారాజు, తాండ్ర స్వరూప, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు చినబోయిన నర్సయ్య, శ్రీను, మడిపల్లి సుధాకర్‌గౌడ్, రాజు, పరశురాములు, డానియల్, మైసాగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

కొమురవెల్లి, నవంబర్ 2 : బీఆర్‌ఎస్‌తోనే ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం కొమురవెల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో ముదిరాజ్‌లకు తగిన గుర్తింపు లభించిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ముదిరాజ్‌లను గుర్తించిన నాథుడే లేడన్నారు. కొంతమంది ముదిరాజ్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు చేసినా ముదిరాజ్‌లంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

## పట్టణంలో భారీ చోరీ

**25 తులాల బంగారం, నగదు అపహరణ**

చేర్యాల, నవంబర్ 2 : చేర్యాల పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలో రెండు దొంగతనాలు జరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ఆటోమొబైల్ వ్యాపారి యంసాని రవీందర్ గత నెల 25న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అనంతరం ఈనెల 1న బుధవారం అర్ధరాత్రి చేర్యాలలోని తన ఇంటికి చేరుకున్న రవీందర్ తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. కబోర్డ్స్‌తోపాటు లాకర్ తదితర వాటిని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఇంట్లో ఉన్న 25 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిందని బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై భాస్కర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మరోవైపు భాసర జ్ఞానసరస్వతీ ఆలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా విధులు నిర్వర్తించే రావుల సుదర్శన్ ఇంట్లో సైతం ఇటీవల చోరీ జరిగింది. ఈ ఘటనలో రెండు తులాల బంగారం, రూ.6 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు.

## బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి**



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 2 : బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీని వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంపత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపించనున్నట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాల జాడేది అని ప్రశ్నించారు. పదేండ్ల క్రితం తెలంగాణ ఎట్లుండే.. ఇప్పుడెట్లుందో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు సమష్టిగా పనిచేసి బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాజా ఆరీఫ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గూళ్ల ఆనందం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దామెర మల్లేశం, ఉపసర్పంచ్ ఆరీఫ్, నాయకులు పుట్ట వెంకట్రమణారెడ్డి, నల్ల బాల్‌రెడ్డి, జంగిటి కమలాకర్, భూర్గు నర్సింహులు, బోయిని మనోహర్, రాచకొండ సాయిలు, నీల బాలకృష్ణ, డాకూరి తిరుపతిరెడ్డి, గవ్వల గణేశ్, మాచర్ల రఘు, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా



పోతిరెడ్డిపల్లిలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేర్యాల, నవంబర్ 2 : మృతుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ నాయకులు అండగా నిలుస్తున్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ల్యాగల చంద్రయ్య, బోకూరి నర్సయ్య కుటుంబ సభ్యులను గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు, సర్పంచ్ కత్తుల కృష్ణవేణి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా ఉంటారని, ఎలాంటి ఆందోళనకు గురికావొద్దన్నారు. పట్టణానికి చెందిన వల్లపు ఎల్లయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ పచ్చిమడ్ల సిద్దిరాములు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గుస్కు వెంకటనర్సయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి పరామర్శించారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల ప్రజాప్రతినిధులు

## అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదించండి

మర్కూక్, నవంబర్ 2 : తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి లక్ష ఓట్ల మెజార్టీ ఇద్దామని బీఆర్‌ఎస్ మండల ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని శివారు వెంకటాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరిస్తూ మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, హరిపంతులు, కనకయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ రావాలి

వర్గల్, నవంబర్ 2 : గజ్వేల్ నుంచి కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ రావాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గురువారం నాచగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. వర్గల్ మండలంలో ఓట్లన్నింటా ఏకతాటిపై ఉన్నారని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేయాలన్నారు.

## నేడు వర్గల్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రచారం

వర్గల్, నవంబర్ 2 : మండలంలోని మజీద్‌పల్లి, మాదారం, గోవిందాపూర్, గిర్మాపూర్, సామలపల్లి, నెంటూర్, జెబ్బాపూర్, మైలారం, చాంద్‌ఖాన్‌మక్త, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో నేడు ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎన్నికల ప్రచారంలో ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఖాజా ఆరీఫ్



ఖాజా ఆరీఫ్

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 2 : బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మద్దూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు ఖాజా ఆరీఫ్‌ను నియమించినట్లు పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా ఆరీఫ్ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా భారీ మెజార్టీతో గెలవనున్నట్లు తెలిపారు. తనను బీఆర్‌ఎస్ మైనార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఐనాపూర్ శివారులో నగదు పట్టివేత

కొమురవెల్లి, నవంబర్ 2 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసుల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రెండు కార్లలో మోతాదుకు మించిన నగదును తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక కారులో రూ.లక్షా 50 వేలు, మరో కారులో రూ.89 వేలను సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు కొమురవెల్లి ఎస్సై నాగరాజు తెలిపారు.

## ఫిజిక్స్‌లో భవానీకి డాక్టరేట్

గజ్వేల్ అర్బన్, నవంబర్ 2 : గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర హబ్‌లో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎన్‌సీసీ అధికారి భవానీకి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. భౌతికశాస్త్రం విభాగంలో లెక్చరర్ భవానీ 'సాలిడ్ కంపోసిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ తయారీ, క్యారెక్టరైజేషన్‌'పై పరిశోధనను ప్రొఫెసర్ ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్, యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ చేతులమీదుగా భవానీ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. గృహిణిగా, లెక్చరర్‌గా, ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌గా భవానీ విధులు నిర్వహిస్తూనే పీహెచ్‌డీ చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల బృందం అభినందించారు.